# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 20-04-2016**

గత పాలకుల అనాలోచిత నిర్ణయాల వల్ల వివిధ కళాశాలల్లో కాంట్రక్టు, అవుట్ సోర్సింగ్ పద్దతిలో పనిచేస్తున్న తెలంగాణ లెక్చరర్లు శాపగ్రస్తులుగా మారారని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు తదితర పేర్లతో నాటి ప్రభుత్వాలు చేపట్టిన నియామకాలు తెలంగాణ నిరుద్యోగుల జీవితాలను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు సిహెచ్. కనకచంద్రం మరియు ప్రతినిధులు గంగ, ఫర్జానా, స్వర్ణలత తదితరులు బుధవారం ముఖ్యమంత్రిని అధికారిక నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

పోస్టులు మంజూరీ చేయకుండానే 2008-09లో గత పాలకులు 73 ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మంజూరు చేశారని, సాంక్షన్డ్ పోస్టుల్లో అప్పటికే పనిచేస్తున్న 632 మందిని ఈ కళాశాలల్లోని అన్ సాంక్షన్డ్ పోస్టుల్లోకి బదిలీచేసి తమకు అన్యాయం చేశారని ముఖ్యమంత్రికి వివరించారు. దాంతో తాము సాంక్షన్ కాని పోస్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల జాబితాలోకి చేరామని, తద్వారా తాము తెలంగాణ ప్రభుత్వం తీసుకు వచ్చిన 16 జీవో ప్రకారం రెగ్యులర్ కావడానికి అనర్హులుగా మారే ప్రమాదం తలెత్తిందని సిఎం కెసిఆర్ కు తమ గోడు వెళ్ళబోసుకున్నారు.

కాగా ప్రభత్వ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులర్ చేయడానికి అర్హతలున్న వారందరినీ గుర్తించి తగున్యాయం చేయాల్సిన అవసరమున్నదని ముఖ్యమంత్రి అన్నారు. గత పాలకులు తీసుకున్న తప్పుడు నిర్ణయాలు తెలంగాణ ప్రభుత్వానికి తలనొప్పిగా మారడమేకాకుండా న్యాయపరమైన చిక్కులు

తెచ్చిపెట్టే పరిస్థితి తలెత్తిందని అభిప్రాయపడ్డారు. ఏది ఏమయినా... మానవతా దృక్పథంతో వీరికి తగు న్యాయం చేయాలన్నారు.

ఉద్యోగుల నియామకం, నియమ నిబంధనలు, రోస్టర్ పద్దతి, వంటి పలు న్యాయపరమైన అంశాలను అధిగమించే విధంగా మానవీయ కోణంలో నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం వుందన్నారు. సరియైన కసరత్తు చేసి సత్వర న్యాయం జరిగే దిశగా కార్యాచరణ చేపట్టాలని విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరిని సిఎం ఆదేశించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**